నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, శుక్రవారం 17 జనవరి 2025 | KARIMNAGAR




## కేటీఆర్‌ను కలిసిన వీర్ల

రామడుగు, జనవరి 16 : ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఈడీ విచారణ అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గురువారం పార్టీ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి, సంఘీభావం తెలిపారు.



మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

## రేవంత్‌రెడ్డిది తుగ్లక్ పాలన

- ఆరు గ్యారెంటీల గురించి అడిగితే అక్రమ అరెస్టులు చేస్తరా..?
- ప్రజల దృష్టి మరల్చేందుకు జైల్లో బంధిస్తరా..?
- ఈ ఫార్ములా ఓ లొట్టపీసు కేసు
- హామీలపై ప్రశ్నిస్తున్నందుకే కేసులతో ఇబ్బంది పెట్టే ప్రయత్నం
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కార్పొరేషన్, జనవరి 16: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డిది తుగ్లక్ పాలనను తలపిస్తున్నదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు, ఆరు గ్యారెంటీలు అమలు చేసేదారి లేక ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని గట్టిగా ప్రజల పక్షాన నిలదీస్తున్నందుకే ఎలాంటి అవినీతి లేకున్నా ఈ ఫార్ములా కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వ్యవహారశైలిని ప్రజలందరూ గమనిస్తున్నారని వారికి త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఫార్ములా కేసు ఓ లొట్టపీసు కేసు అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి కావాలనే ఫార్ములా ఈ రేస్ రద్దు చేసి తెలంగాణ యువతకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ రేస్ కేసులో అసలు కరప్షనే జరుగనప్పుడు అవినీతి కేసు ఎలా పెడుతారని నిలదీశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కొట్లాది రూపాయలకు అమ్ముడుపోయాడని ఆరోపించారు. అందుకే ఆయనను ఏ పార్టీ అని నిలదీశానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ బీ ఫాంపై గెలిచిన ఆయన మా పార్టీ బట్టలు విప్పుతానని మాట్లాడితే ఊరుకోవాలా..? అని ప్రశ్నించారు. సంజయ్‌కుమార్ బీఆర్ఎస్, కేసీఆర్ బొమ్మ లేకపోతే వార్డు మెంబర్‌గా కూడా గెలవగలడా..? అని నిలదీశారు. కరీంనగర్ సమీక్షా సమావేశంలో మంత్రుల ఆదేశాల మేరకు అందరూ ఎమ్మెల్యేలు తనను బెదిరించారని, కరీంనగర్ ఆర్డీవో ఎవరో తనకు తెలియదని, ఆయన తనపై కేసు ఎలా పెడుతారని ప్రశ్నించారు. సమీక్షా సమావేశం ఉందని పిలిచి ఇలా కేసులు పెడతారా..? అని మండిపడ్డారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమారే తనపై దాడి చేశాడన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసేదాకా ప్రశ్నిస్తూనే ఉంటామని, కడిగేస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ సాధించకుంటే రేవంత్‌రెడ్డికి సీఎం సీటు వచ్చేదా అని ప్రశ్నించారు. తన మీద ఎలాంటి క్రిమినల్, ల్యాండ్ గ్రాబింగ్ కేసులు లేవని, కానీ పీడీ యాక్ట్ పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పీడీ యాక్టు పెట్టాలంటే తనకంటే ముందుగా సీఎం రేవంత్‌రెడ్డిపైనే పెట్టాలని సూచించారు. పండుగ సమయంలో అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం ఏమిటని, ఇది ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేస్తామని, ఎవరికీ భయపడేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

## సహకార సమరం జరిగేనా..?




- వచ్చేనెల 15తో ముగియనున్న పీఏసీఎస్ పాలకవర్గాల గడువు
- ఎన్నికల నిర్వహణ దిశగా ముందుకు సాగని ఏర్పాట్లు
- పంచాయతీ ఎన్నికల తర్వాత పరిశీలించే అవకాశం
- ఆరు నెలలపాటు గడువు పొడిగించే యోచనలో ప్రభుత్వం
- ఆ తర్వాతైనా ఎన్నికలు నిర్వహిస్తారా.. లేదా..? అన్న సందేహాలు

**ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. పాలకవర్గాల గడువు వచ్చే నెల 15తో ముగియనుండగా.. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాక యంత్రాంగం సైతం ముందుకెళ్లడం లేదు. దీంతో ఎన్నికల సమరం సాగదన్న సంకేతాలే వెలువడుతుండగా.. ఆశావహుల్లో మాత్రం ఆసక్తి నెలకొన్నది. కాగా, ప్రభుత్వం పాలకవర్గాల గడువు మరో ఆరు నెలలు పొడిగిస్తుందన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తుండగా.. ఇక్కడ మరో విషయంపై జోరుగా చర్చ నడుస్తున్నది. పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత ఆయా పోస్టులను నామినేటెడ్ ద్వారా భర్తీ చేసేందుకు కూడా సర్కారు ఆలోచనలు చేస్తున్నదన్న ప్రచారం సాగుతున్నది. అయితే, నామినేటెడ్ అనేది పీఏసీఎస్‌లకు వర్తిస్తుందా.. లేదా..? అన్న అంశంపై అనేక సందేహాలు వ్యక్తమవుతుండగా.. ఈ విషయంపై అధికారుల నుంచి గానీ, ప్రజాప్రతినిధుల నుంచి గానీ పూర్తి స్థాయి క్లారిటీ కరువైంది.**

కరీంనగర్, జనవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలు 2020లో జరిగాయి. పాలకవర్గాల ఐదేళ్ల పదవీ కాలం వచ్చే ఫిబ్రవరి 15తో ముగియనున్నది. ఇంకా 29 రోజులు మాత్రమే మిగిలి ఉన్నది. నిబంధనల ప్రకారం చూస్తే పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలి. ఆయా సంఘాలకు డైరెక్టర్లు, చైర్మన్లను ఎన్నుకోవాలి. ఎటువంటి అడ్డంకులూ లేకుండా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే తక్కువలో తక్కువ కనీసం నెల రోజుల ముందుగానే నోటిఫికేషన్ రావాలి. గతంలో జరిగిన ఎన్నికలను బట్టి చూస్తే ఇప్పటికే నోటిఫికేషన్ జారీ కావాలి. ఆ మేరకు ఓటర్ జాబితా ప్రకటించాలి. గ్రామ పంచాయతీల్లో అతికించాలి. అందులో ఏమైనా అభ్యంతరాలు వస్తే పరిష్కరించి తుది జాబితా సైతం వెల్లడించాలి. ఈ ప్రక్రియ నడుస్తుండగానే అధికారులు ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి. ఈ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరగనుండగా, బ్యాలెట్ బాక్సుల సేకరణతోపాటు బ్యాలెట్ పేపర్ల ముద్రణకు రెడీ చేయాలి. నిబంధనల ప్రకారం ఎన్నికల నాటికి రుణం తీసుకున్న రైతులకు ఏడాది పూర్తయితేనే ఓటు హక్కు లభించనుండగా.. ఈ లెక్కను కూడా గుర్తించాలి. అయితే, ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు జిల్లా సహకార రిజిస్ట్రార్ ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తారు. కానీ, ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలూ రాలేదు. ఈ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తే ఇప్పట్లో సహకార సమరం జరిగేలా కనిపించడం లేదు.

**ఆయా జిల్లాల్లో ఉన్న పీఏసీఎస్‌లు, ప్రతిపాదిత పీఏసీఎస్‌లు, మొత్తం సంఖ్య వివరాలు.. దీంతోపాటు సిద్దిపేట, భూపాల్‌పల్లి, హనుమకొండ జిల్లాల్లో ఉన్న పాతవి, కొత్తగా ప్రతిపాదించిన పీఏసీఎస్‌ల వివరాలు**

| జిల్లా | పాత పీఏసీఎస్‌లు | ప్రతిపాదిత పీఏసీఎస్‌లు | మొత్తం |
|---|---|---|---|
| కరీంనగర్ | 30 | 8 | 38 |
| సిరిసిల్ల | 24 | 9 | 33 |
| జగిత్యాల | 51 | 6 | 57 |
| పెద్దపల్లి | 20 | 7 | 27 |
| సిద్దిపేట | 4 | 3 | 7 |
| భూపాల్‌పల్లి | 4 | 4 | 8 |
| హనుమకొండ | 2 | 3 | 5 |
| మొత్తం | 135 | 40 | 175 |

### నామినేట్ చేస్తారా.. పొడిగిస్తారా..?

సహకార ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఈ పరిస్థితులను చూస్తే ఎన్నికలు నిర్వహించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న విషయం మాత్రం స్పష్టమవుతున్నది. నిజానికి ఇప్పటికే పదవీ కాలం ముగిసిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఈ విషయంలో రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతున్నది. అందులో భాగంగానే బీసీ జనాభా లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం ఇటీవలే సర్వే చేపట్టింది. ఆ సర్వే సమగ్ర వివరాలు వచ్చాయని చెబుతున్నది. అదే నిజమైతే ముందుగా పంచాయతీ ఎన్నికలుండే అవకాశమున్నది. ఇప్పటికే జీపీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలంటూ ప్రభుత్వం పలుసార్లు ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో సహకార ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని తెలుస్తున్నది. అలాగే, తమ పాలకవర్గాల గడువు మరో ఆరునెలల పాటు పొడిగించాలని ఇప్పటికే పలువురు పీఏసీఎస్ చైర్మన్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం, ఇప్పటికిప్పుడు ఎన్నికలు సాధ్యమయ్యే అవకాశాలు లేకపోవడం కారణంగా పదవీ కాలం పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అందుకు సంబంధించి ఒక ఫైల్ కూడా మూమెంట్ చేస్తున్నట్టు తెలుస్తున్నది. అంతేకాదు, నాలుగైదు రోజుల్లో దీనిపై పూర్తిస్థాయి క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తున్నది. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన చర్చ నడుస్తున్నది. పదవీ కాలం పొడిగించకుండా.. పాలకవర్గాల సమయం పూర్తయిన తర్వాత కొంత సమయం తీసుకొని.. డైరెక్టర్లు, చైర్మన్ల పోస్టులను నామినేట్ ద్వారా భర్తీ చేసే ఆలోచన సైతం ప్రభుత్వం వద్ద ఉందనే ప్రచారం కూడా సాగుతున్నది. అయితే, పీఏసీఎస్‌ల విషయంలో నామినేట్ చేయవచ్చా.. లేదా..? అనే విషయంపై క్లారిటీ రావడం లేదు. దీనిపై అనేక సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు మాత్రం ఎవరికి వారే తమ వ్యూహ రచన అమలు చేస్తున్నారు. సహకార సంఘాల పరిధిలో ఉన్న ఓటర్ల వద్దకు వెళ్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

## ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాల రూరల్, జనవరి 16 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులను ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 18న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం10:30కి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బీ సత్తమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ జగిత్యాలలో బిజినెస్ డెవల్మెంట్ మేనేజర్స్ ఖాళీల కోసం ఇంర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటి కోసం డిగ్రీ ఉత్తీర్ణత ఉండి 28-35లోపు వయసు ఉండాలని, మార్కెటింగ్‌లో ఒక సంవత్సరం పని అనుభవం కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు జగిత్యాలలో పనిచేయాల్సి ఉంటుందని, నెలకు రూ.16 వేల నుండి రూ.25వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.



మాట్లాడుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## బెదిరింపులకు భయపడేదిలేదు

- చొప్పదండి ఎమ్మెల్యే.. దమ్ముంటే అభివృద్ధి చేయి
- ఈ నెల 20లోగా నారాయణపూర్ రిజర్వాయర్ నింపకపోతే ఆందోళన చేస్తాం
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 16 : కాంగ్రెస్ చేసే బెదిరింపులకు భయపడేది లేదని, కక్షపూరిత, కుట్రపూరిత కేసులకు బీఆర్ఎస్ నాయకులెవరూ బెదరరని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. పిచ్చి వేషాలు చేస్తే ప్రజలు ఉరికించి కొడుతారని హెచ్చరించారు. ఫార్ములా ఈ-రేసులో అసలు అవినీతి జరుగనప్పుడు కేసులు ఎలా పెడుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఏమీ అమలు చేయకుండా పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని నిర్బంధాలు పెట్టినా కేటీఆర్‌ను ఏమీ చేయలేరని పేర్కొన్నారు. కేటీఆర్‌ను జైలుకు పంపించాలన్న కుట్రతోనే తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. చిల్లర చేష్టలతో బీఆర్ఎస్‌ను ఏమీ చేయలేరన్నారు. కాంగ్రెస్ 13 నెలల పాలనలో కక్ష పూరిత, కుట్ర పూరిత కేసులు తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు కాంగ్రెస్‌ను ప్రజల్లో నిలదీస్తామన్నారు. తమ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యేను ఏ పార్టీలో ఉన్నావని అడిగినందుకే కేసులు పెడుతారా? అని ప్రశ్నించారు. చొప్పదండి ఎమ్మెల్యే స్థాయి మరిచి విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాని దద్దమ్మ అని, ఆయనకు కేటీఆర్‌ను విమర్శించే స్థాయిలేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఒక్కరిని ముట్టుకున్నా వీపు విమానం మోగిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలో అక్రమ దందాలు, కమీషన్లు వసూలు చేయడం తప్ప అభివృద్ధి చేసింది ఏమీ లేదన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులను కూడా పోలీసులను పెట్టుకొని పంచే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. ఈ నెల 20లోగా నారాయణపూర్ రిజర్వాయర్‌లో నీటిని నింపాలని, లేకపోతే గంగాధర చౌరాస్తాలో భారీ ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఓ పక్క పొలాలు ఎండిపోతుంటే నీళ్లు ఇచ్చామని తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

## ఉచిత శిక్షణకు ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 16: ఎస్సెస్సీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, బ్యాంకింగ్ పోస్టులకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా ఎం రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 20 నుంచి వెబ్‌సైట్ (http;\\tgbcstudycircles.cgg.gov.i)లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు, గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందినవారు, ప్రస్తుతం విద్య అభ్యసిస్తున్న వారు అనర్హులని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారి కుటుంబ వార్షికాదాయం ₹1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని అభ్యర్థులకు ఏడాదికి ₹2లక్షలకు మించకుండా ఉన్నవారు మాత్రమే అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం నంబర్‌ను (0878-2268686) కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

### నాలుగు రోజుల్లో ఎత్తిపోయాలి

చొప్పదండి నియోజకవర్గానికి వరప్రదాయినిగా ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌ను ఎల్లంపల్లి జలాలతో నింపాలి. ఇక్కడి నుంచి చెరువులను నింపి పంటలు ఎండిపోకుండా కాపాడాలి. కేసీఆర్ పాలనలో రిజర్వాయర్ నిండుకుండలా మారి ఎనిమిదేళ్లు సాగునీటికి ఏ ఇబ్బంది రాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గి, పంటలకు సాగునీరందడం లేదు. నాలుగు రోజుల్లో రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తాం.

**- సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే**



నారాయణపూర్ రిజర్వాయర్ కింద వేసిన వరి

- రిజర్వాయర్‌లో తగ్గిన నీటిమట్టం
- సకాలంలో నీరందకపోతే యాసంగి సాగు ప్రశ్నార్థకం?
- 30వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినే ప్రమాదం
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోయాలని డిమాండ్



నారాయణపూర్ రిజర్వాయర్‌లో తగ్గిన నీటి మట్టం

## నారాయణపూర్.. ఏదీ భరోసా?

**కేసీఆర్ పాలనలో ఎనిమిదేళ్ల పాటు పుష్కలమైన నీటితో కళకళలాడిన నారాయణపూర్ రిజర్వాయర్.. ఈసారి వెలవెలబోతున్నది. నీటిమట్టం తగ్గిపోవడంతో ఆయకట్టులో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం కనిపిస్తున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను విడుదల చేసి రిజర్వాయర్‌ను నింపకుంటే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉండగా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.**

గంగాధర, జనవరి 16 : నారాయణపూర్ రిజర్వాయర్ చొప్పదండి నియోజకవర్గానికి వరప్రదాయినిగా ఉన్నది. ఈ రిజర్వాయర్‌కు 2004లో శంకుస్థాపన జరుగగా, పూర్తి చేయడంపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకంలో భాగంగా ధర్మారం మండలం నందిమేడారం నుంచి ఈ జలాశయం వరకు 2012-13లో పైపులైన్ వేసి మిగిలిన పనులను అర్థాంతరంగా వదిలేసింది. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక దృష్టి సారించారు. నందిమేడారం నుంచి నారాయణపూర్ జలాశయం వరకు పైపులైన్‌కు మరమ్మతులు చేయించగా, 2016 అక్టోబర్ 15న తొలిసారి ట్రయల్‌రన్ ద్వారా నీటిని ఎత్తిపోశారు. 164 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నిల్వ సామర్థ్యమున్న నారాయణపూర్ రిజ్వయర్‌ను నింపి, ఇక్కడి నుంచి చొప్పదండి నియోజకవర్గంలోని దాదాపు 70 చెరువులను తరలించడంతోపాటు దాదాపు 30 వేల ఎకరాలకు సాగు నీరు అందేలా చేశారు. దీంతో రైతులు ఆకాశం వైపు చూడకుండా పంటలు సాగు చేశారు. రెండు సీజన్లలోనూ ఎనాడూ రోడ్డెక్కకుండా మంచి దిగుబడులు తీశారు.

### ప్రస్తుతం తగ్గిన నీటి మట్టం


ఈ యేడాది రిజర్వాయర్‌లో నీటి మట్టం భారీగా తగ్గింది. ప్రస్తుతం సగం కూడా నీరు లేకపోవడంతో చెరువులను నింపే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయకట్టులో పంటలు కాపాడుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే యాసంగి వరి నాట్లు వేసిన రైతులు బావులు, చెరువుల్లో ఉన్న అరకొరగా నీటితో పంటలను కాపాడుకుంటున్నారు. కానీ, మున్ముందు నీరందకపోతే పంటలు ఎండే ప్రమాదముంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఎల్లంపల్లి ప్రాజెక్టునుంచి నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌తో పాటు ఇక్కడి నుంచి గ్రామాల్లోని చెరువులను నింపాలని, పంటలు ఎండి పోకుండా కాపాడాలని కోరుతున్నారు.

### కరువన్నదే లేకుండె



ఏదాడి కిందటి వరకు కరువన్నదే లెకుండె. రిజర్వాయర్‌లో నీళ్లు ఉండుడుతోని రైతులు సంతోషంగా పంటలు సాగు చేసుకున్నరు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పన్నెండేండ్ల కిందటి పరిస్థితిని తెచ్చింది. రిజర్వాయర్‌లో ఎన్నడూ లేని విధంగా నీటి మట్టం తగ్గింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని ఎత్తిపోసి పంటలు ఎండిపోకుండా చూడాలి. **- గడ్డం స్వామి, రైతు (బూరుగుపల్లి)**

### పన్నెండేండ్ల కిందటి పరిస్థితి వచ్చింది



ఒకప్పుడు చొప్పదండి నియోజకవర్గంలో బీడు భూములే ఎక్కువ కనిపించేవి. రిజర్వాయర్‌లో నీళ్లు లేక రైతులు వానకాలం పంటలు మాత్రమే వేసేవాళ్లు. 2004లోనే రిజర్వాయర్ పనులను ప్రారంభించినా అప్పటి ప్రభుత్వం పూర్తి చేయలేదు. దీంతో నీళ్లు లేక రిజర్వాయర్ ఎండిపోయి కనిపించేది. కేసీఆర్ సర్కారు వచ్చినంక ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రిజార్వయర్‌కు నీళ్లు వచ్చినయ్. మళ్లీ ఇప్పుడు పన్నెండేండ్ల కిందటి పరిస్థితే వచ్చింది.

**- ఎండీ నజీర్, మాజీ సర్పంచ్ (నారాయణపూర్)**

## కవిత పోరాట ఫలితంగానే పసుపు బోర్డ్

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత
- వెల్దుర్తిలో కేసీఆర్, కేటీఆర్, కవిత చిత్రపటానికి పాలాభిషేకం

జగిత్యాల రూరల్, జనవరి 16 : పసుపు బోర్డు ఏర్పాటుకు ముఖ్య కారణం ఆనాటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత సుదీర్ఘ పోరాటమేనని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ స్పష్టం చేశారు. జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామంలోని పసుపు క్షేత్రంలో గురువారం రైతులతో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కవిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత పసుపు రైతుల సుదీర్ఘ కాల పోరాటంలో భాగంగా ఆనాటి ఎంపీ కవిత నాయకత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనేక సార్లు సంబంధిత కేంద్ర మంత్రులను కలిశారని, పార్లమెంట్‌లో కవిత గళమెత్తడం వంటి పోరాటాల ఫలితంగా పసుపు బోర్డు ఏర్పాటు కల ఫలించిందన్నారు. పసుపు పండించే రాష్ట్రాల ముఖ్య మంత్రులతో కేంద్రానికి పసుపు బోర్డు ఏర్పాటు కోసం లేఖలు ఇప్పించడం కోసం ఆమె చేసిన కృషిని గుర్తు చేశారు. పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15 వేలు ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పసుపునకు గుర్తింపు వచ్చేలా జీఐ ట్యాగింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ మాజీ చైర్మన్ సదాశివరావు, బీఆర్ఎస్ రూరల్ మండలాధ్యక్షుడు ఆనందరావు, మాజీ సర్పంచ్ ప్రవీణ్, నాయకులు రాంరెడ్డి, శేఖర్, రామకిషన్, గంగారెడ్డి, మహేష్, హరీష్, రామస్వామి, లక్ష్మణ్, మాలయ్య, లక్ష్మీరాజం పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, రైతులు